

## కూడ వెల్లి వాగుకు నీటిని విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి

గజ్వేల్ నియోజకవర్గం: 02 ఫిబ్రవరి 2024 (ప్రజా కలం ప్రతినిధి)

బిఆర్ఎస్ ప్రభుత్వం పైసల కోసమే పని చేసింది కానీ రైతుల శ్రేయస్సు కోసం, రైతులకు సేవ చేయడం కోసం పని చేయలేదని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామం వద్ద మల్లన్న సాగర్ కాలువ నుండి దుబ్బాక నియోజకవర్గం రైతులకు సాగునీటిని కూడవెల్లి వాగు లోకి నీటిని ఇరిగేషన్ అధికారులతో కలిసి నర్సారెడ్డి, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తో కలిసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సొంత నియోజకవర్గంలో కాలువల నిర్మాణంలో నాణ్యత లేదని, తన నియోజకవర్గం గా భావించే హరీష్ రావు వాళ్ళు చేపట్టిన పనుల నాణ్యత ఎలా ఉందో వచ్చి చూడాలని అన్నారు. రైతుల శ్రేయస్సు కోసం ఇరవై ఏళ్ల కిందట కూడవెల్లి వాగులో చెక్ డ్యామ్ లు నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీ ది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రాణహిత చేవెళ్ల గజ్వేల్ లోనే ప్రారంభించారని నర్సారెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



గజ్వేల్: 02 ఫిబ్రవరి 2024 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్ మూడవ వార్డులో ఐలాపురం (యాదగిరి) సత్తయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి కనకయ్య మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

## సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు



సిద్దిపేట: 02 ఫిబ్రవరి 2024 (ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ 7 (1), 2016, యాక్ట్, 22 (1) (a )నుండి (f ) మరియు 22 (2) (a) & ( b), &% 22 (3) సిటీ పోలీస్ యాక్ట్, 1348 No IX ఫాస్లి సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం తేది 03-02-2024 ఉదయం 6:00 నుండి 18-02-2024 ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటుంది. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించ కూడదు. పైన పేర్కొన్న కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలి, బంద్ ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాము.

మరియు శాంతిభద్రతల పరిరక్షణ నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగం పై నిషేధాజ్ఞలు తేదీ: 03-02-2024 ఉదయం 6 గంటల నుండి తేదీ: 18-02-2024 ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటుంది. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ 7(1) 2016, యాక్ట్, సెక్షన్ 55 db (A), 45db (A), 65db (A), 30 పోలీస్ యాక్ట్ 1861, రూల్ నెంబర్ 8 నోన్ పొల్యూషన్, (రెగ్యులేషన్ & కంట్రోల్) రూల్స్ 2000 ప్రకారం పోలీస్ కమిషనర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్ తో కూడిన డిజె సౌండ్ వినియోగం పై నిషేధాజ్ఞలు విధించడం జరిగింది.

మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసిపి అధికారుల అనుమతి పొందాలని సూచించారు. పై నిబంధనలు ఉల్లంఘించి డీజే వినియోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పై నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 188 IPC, సెక్షన్ 70(A), 70(B) 70 C, 76, సిటీ పోలీస్ యాక్ట్ 1348 ఫాస్లి సెక్షన్ 76, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## 29 రూపాయిలకే కిలో రైస్

హైదరాబాద్, ఫిబ్రవరి 2,: ధరల పెరుగుదలను అరికట్టేందుకు వచ్చే వారం నుంచి భారత్ రైస్ చొరవ కింద సబ్సిడీ ధాన్యాన్ని రిటైల్ అవుట్‌లెట్ల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రిటైల్ అవుట్‌లెట్ల ద్వారా కిలో బియ్యాన్ని రూ. 29కి విక్రయించే అధికారిక నిర్ణయం వచ్చే రెండు రోజుల్లో ప్రకటించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం బియ్యం ధరలు ఆకాశన్నంటుతున్నాయి. రిటైల్ మార్కెట్‌లో సన్నబియ్యం రూ. 50 నుంచి 60 వరకు పలుకుతుంది. ఈ నేపథ్యంలోనే కేంద్రం బియ్యం ధరలను నియంత్రించేందుకు చర్యలు ప్రారంభించింది. భారత్ రైస్ ను కేవలం రూ. 29కి విక్రయించేందుకు సన్నాహాలను ప్రారంభించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎగుమతులు, బహిరంగ మార్కెట్ అమ్మకాలపై నియంత్రణలు ఉన్నప్పటికీ.. అధికంగా ఉన్న భారీ వినియోగ బియ్యం రకాల రిటైల్ ధరలను తగ్గించేందుకు ప్రణాళిక రూపొందించనుంది. బియ్యం ధరల సమస్య ఆందోళనకరంగానే ఉంది, ఆశాజనక భారత్ రైస్ చొరవ ధరలను తగ్గించడంలో కొంత ప్రభావం చూపవచ్చని అధికారవర్గాలు తెలిపాయి. రికార్డు స్థాయిలో ఉత్పత్తి, ఎఫ్‌సీఐ వద్ద పుష్కలంగా నిల్వలు, ధాన్యం ఎగుమతులపై పలు పరిమితులు, సుంకాలు విధించినప్పటికీ దేశీయంగా బియ్యం ధరలు భారీగా పెరిగాయని ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం, ప్రభుత్వం భారత్ దాల్ కేజీ రూ. 60, భారత్ ఆటా (పిండి) కేజీ రూ. 27.5 గా సబ్సిడీ ధరలకు విక్రయిస్తోంది. అదనంగా ఎఫ్‌సిఐ ఇప్పటివరకు తన మిగులు స్టాక్‌ల నుంచి బహిరంగ మార్కెట్ విక్రయ పథకం కింద 7 మిలియన్ టన్నుల గోధుమలను బల్క్ గా కొనుగోలుదారులకు విక్రయించింది. అయితే, భారత్ రైస్ కింద.. ఎఫ్సీఐ వద్ద దాదాపు 0.45 ఎంటి నాన్–ఫోర్టిఫైడ్ రైస్ స్టాక్‌ను రైతుల సహకార సంస్థ నాఫెడ్, నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ , కేంద్రీయ భాండార్స్ వంటి ఏజెన్సీల ద్వారా రిటైల్ విక్రయాల కోసం మొదటగా అందించనున్నట్లు సమాచారం.. జూలై, 2023 నుండి ఎఫ్సీఐ ప్రస్తుత సంవత్సరానికి 5 ఎంటి కేటాయింపులకు వ్యతిరేకంగా ఇప్పటివరకు వారపు ఇ–వేలం ద్వారా 0.16 ఎంటి బియ్యాన్ని మాత్రమే విక్రయించగలిగింది. డిసెంబర్‌లో రిటైల్ బియ్యం ధరలు 12.33% పెరిగాయి. అక్టోబర్ 2022 నుండి బియ్యం ధరలు పెరిగిన స్థాయిలో ఉన్నాయి. ఎఫ్సీఐ స్టాక్ నుండి మిగులు బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించడానికి ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ ఇది జరిగింది. ప్రభుత్వం తెల్ల బియ్యం ఎగుమతులను నిషేధించింది. దేశీయ సరఫరాలను మెరుగుపరచడానికి గత సంవత్సరం పార్–బాయిల్డ్ రైస్‌పై 20% ఎగుమతి సుంకాలను విధించింది. ప్రస్తుతం, ఎఫ్‌సిఐ 19.54 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలను కలిగి ఉంది. మిల్లర్ల నుండి స్వీకరించదగిన 37 మెట్రిక్‌టన్నులు మినహాయించి. జనవరి 1కి 7.61 ఎంటి బఫర్‌కు వ్యతిరేకంగా బియ్యం స్టాక్ ఉంది.

## కేటీఆర్ నియోజకవర్గంపై కాంగ్రెస్ గురి

కరీంనగర్, ఫిబ్రవరి 2 : చేరికలపైనా కాంగ్రెస్ దూకుడు పెంచింది. ముఖ్యంగా బీఆర్ఎస్ ముఖ్య నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్తోంది. అందులో భాగంగా బీఅర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంపై మొదట గురి పెట్టింది. సిరిసిల్ల వ్యవహారాలు దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఇప్పటికే అయన సమక్షంలో పలువురు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉన్న సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు అధిష్టానం ఫోకస్ పెట్టింది. గత పదేళ్లుగా ఇక్కడ బీఆర్ఎస్ వరుసగా విజయాలు సాధిస్తూ బలోపేతం అయ్యింది. అంతేకాకుండా ఇక్కడి నుంచే కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన సొంత సెగ్మెంట్‌పైనే దెబ్బకొడితే.. రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం ఉంటుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్‌లో ఉన్న విభేదాలను తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల పదహారు మంది కౌన్సిలర్లు క్యాంపుకి వెళ్ళారు. అయితే వారిని ఒప్పించి మళ్ళీ సిరిసిల్లకు తీసుకువచ్చారు కొంతమంది బీఆర్ఎస్ నేతలు. కానీ సిరిసిల్ల మున్సిపాలిటీలో అవిశ్వాసం భయం ఇంకా వీడలేదు. దీని వెనక కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన పొన్నం ప్రభాకర్‌కు ఈ సెగ్మెంట్ నేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. ముందుగా సెకండ్ క్యాడర్ నేతలను కాంగ్రెస్ కండువా కప్పించే ప్రయత్నం చేస్తున్నారు. పొన్నం ప్రభాకర్ సమక్షంలో ముస్తాబాద్ జడ్పీటీసీతో పాటుగా పలువురు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మిగతా మండలాలకు సంబంధించిన నేతలతో కూడా పొన్నం సమావేశం నిర్వహిస్తున్నారు. కేటీఆర్‌ను టార్గెట్ చేస్తే బీఅర్ఎస్ పార్టీ బలహీనపడుతుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపైనా తీవ్రమైన విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల హామీలను గాలికి వదిలేసి కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని ఆరోపణలు చేస్తున్నారు. కేటీఆర్‌ను నైతికంగా దెబ్బ తీయాలంటే ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలోనే చేరికలను వేగవంతం చేయాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పార్టీను విస్తరించడంలో దృష్టి పెట్టారు. భూ కబ్జాదారులు, ప్రభుత్వ భూములను అక్రమించిన వారిపైనా వెంటనే చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు అదేశాలు జారీ చేశారు. గతంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలపైనా భూకబ్జా ఆరోపణలు వచ్చాయి. వీటిపైనా వెంటనే విచారణ చేపట్టాలని సమీక్ష సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అదే విధంగా కరీంనగర్‌లో భూఆక్రమణలకు పాల్పడిన కార్పొరేటర్‌లను అరెస్టు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. మొత్తానికి ఈ నెల రోజులలో సిరిసిల్లలో రాజకీయ పరిణామాలు వేగంగా మారనున్నాయి. పోరాటం చేయడానికి సిద్ధంగా ఉండాలని.. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు కల్పించినా.. ముందుకు సాగాలని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛగా ఉన్నారని, గతంలో మంత్రి సిరిసిల్లకు వస్తే చాలామందిని అరెస్టు చేసేవారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు చూసి.. కొంతమంది బీఆర్ఎస్ నేతలు తమ పార్టీలోకి వస్తున్నారని చెబుతున్నారు.




# విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ,
పాఠకుల విశేష ప్రజాదరణ పొందుతూ
విజయవంతంగా రెండు తెలుగు రాష్ట్రాలలో నడపబడుతున్న
'ప్రజాకలం' తెలుగు దినపత్రికకు
జర్నలిజంపై ఆసక్తి, తెలుగు భాష పట్ల అవగాహన కలిగి
వ్రాయడం, చదవడంతో పాటు ప్రస్తుత సమాజం పట్ల బాధ్యత
కలిగిన విలేకరులు అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్
రిపోర్టర్లు మండలాల వారిగా కావలెను.

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
తెలుగు దినపత్రిక

## తెలంగాణలో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను




**సంప్రదించాల్సిన నంబరు: 9010972526**

## ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను



## బ్లాక్ చీరలో అందాల అషు

సోషల్ మీడియా ద్వారా జూనియర్ సమంత అంటూ గుర్తింపు దక్కించుకున్న అషు రెడ్డి ఆ తర్వాత బుల్లి తెర ద్వారా మరింతగా ప్రేక్షకులకు చేరువ అయ్యింది. బిగ్ బాస్ లో ఎంట్రీ ఇవ్వడం, వర్మ కంపెనీ అంటూ ముద్ర పడటంతో పాటు సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోల వల్ల హీరోయిన్ రేంజ్ గుర్తింపు దక్కింది. అషు రెడ్డి అందాల ఆరబోత ఫోటోలు రెగ్యులర్ గా సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసిన అషు రెడ్డి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈసారి అషు రెడ్డి చీర కట్టు ఫోటోలను షేర్ చేసింది. సాధారణంగానే అషు రెడ్డి ఫిజిక్ కి చీర కట్టు చాలా బాగా సెట్ అవుతుంది అంటూ నెటిజన్స్ మాట్లాడుకుంటూ ఉంటారు.అలాంటిది ఇప్పుడు ట్రాన్సపరెంట్ చీర కట్టు లో అషు రెడ్డి వావ్ అనిపించేంత అందంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్ లో అందంగా ఉన్న అషు రెడ్డి కాస్త గట్టిగా ట్రై చేస్తే కచ్చితంగా సినిమాల్లో మంచి ఆఫర్లు వస్తాయి. కానీ ఈ అమ్మడు మాత్రం ఎక్కువగా సినిమాలు చేయడం లేదు అంటూ కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలుగు లో కాకున్నా తమిళ్ లో అయినా ఈమె ఆఫర్ల కోసం ప్రయత్నిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.




# 'హీరో హీరోయిన్' ఫస్ట్‌లుక్‌కి భారీ రెస్పాన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ప్రజాకలం ప్రతినిధి):

దివ్యా ఖోస్లా కుమార్ యొక్క తదుపరి తెలుగు, హిందీ చిత్రం ' హీరో హీరోయిన్' , ప్రకటన నాటి నుండే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కొన్ని రోజుల క్రితం విడుదలైన ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ కు అపూర్వమైన స్పందన లభించింది. త్వరలోనే పెద్ద స్క్రీన్‌లపై ఈ చిత్రాన్ని చూడటానికి ఆసక్తిని కనబరుస్తున్నారు. మేకర్స్ దివ్య 2 వ లుక్ పోస్టర్‌ను విడుదల చేయడంతో పాటు హైదరాబాద్‌లో ఈ చిత్రం యొక్క మొదటి షెడ్యూల్ షూటింగ్‌ను ప్రారంభించారు. 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ,' 'ప్యాడ్‌మాన్,' మరియు 'పరి' వంటి విప్లవాత్మక చిత్రాల రూపకల్పన ద్వారా పేరుగాంచిన ప్రముఖ నిర్మాత ప్రేరణా అరోరా 'హీరో హీరోయిన్,' ఈ తెలుగు-హిందీ చిత్రం రూపొందిస్తున్నారు. సురేష్ కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆన్-స్క్రీన్ రొమాన్స్ నిజ జీవిత ప్రేమగా మారే స్క్రిప్ట్ లేని ప్రయాణాన్ని అన్వేషిస్తుంది. కొన్ని రోజుల క్రితం సూపర్ గ్లామరస్ దివ్యా ఖోస్లా కుమార్‌తో కూడిన మొదటి పోస్టర్‌ను విడుదల చేయడంతో అభిమానులు మరియు పరిశ్రమలో ఉత్సాహం స్పష్టంగా కనిపించింది! దివ్య యొక్క ఫస్ట్ లుక్ చిక్ మరియు క్లాస్సి దివాను అందించగా, రెండవ పోస్టర్ మనలను మీనా కుమారి మరియు వైజయంతిమాల యుగంలో పూర్తి గాంభీర్యంతో వెనక్కి తీసుకువెళ్లడం ఖాయం, ముగుస్తున్న కథనంతో గ్లామర్‌ను సజావుగా మిళితం చేసే విజువల్ ట్రీట్‌ను వాగ్దానం చేస్తుంది. దివ్యా ఖోస్లా కుమార్ మాట్లాడుతూ , "ఇది నేను ఇప్పటివరకు పోషించిన అత్యుత్తమ పాత్రలలో ఒకటి. 'హీరో హీరోయిన్' ప్రపంచంలోకి అడుగు పెట్టడం నాలో ఎప్పటికీ నిలిచిపోయే ఆనందకరమైన అనుభవం. ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు నేను థ్రిల్‌గా ఉన్నాను. ఈ చిత్రం మీ మనసును కదిలించే అనేక అంశాలను కలిగి ఉంది "అని అన్నారు. సినిమా దృశ్యం వెనుక ఉన్న సృజనాత్మక శక్తి ప్రేరణా అరోరా మాట్లాడుతూ "ఇప్పటి వరకు వచ్చిన స్పందన పట్ల సంతోషంగా వున్నాము. ఇది నా హృదయానికి చాలా దగ్గరగా ఉన్న చిత్రం. ఈ ప్రేమ కథ మిమ్మల్ని మీ సీట్ల అంచున నిలబెడుతుంది హామీ ఇస్తున్నాను. ఈ చిత్రం ఆధునిక ప్రేమ యొక్క వేడుక. నా గత చిత్రాల మాదిరిగానే ఈ చిత్రం కూడా అపూర్వ ఆదరణ పొందుతుందని ఆశిస్తున్నాను" అని అన్నారు.

## అందంతో పాటు తెలివి కూడా ఎక్కువే..!

కన్నడ నుంచి ఎవరు వచ్చినా వారికి టాలీవుడ్ లో లక్ ఫేవర్ అవుతుంది. కొందరు మొదటి సినిమాతోనే సక్సెస్ అవ్వగా మరికొందరు ప్రయత్నాలు చేస్తుంటే ఫాం లోకి వస్తారు. రీసెంట్ టైం లో కన్నడ నుంచి వచ్చి తెలుగు సినిమాల్లో సందడి చేస్తున్న రష్మిక, కృతి శెట్టి తరహాలో ఇప్పుడు మరో అందాల భామ కూడా అదరగొట్టబోతుంది. కన్నడ లో సినిమాలు చేసి ఒక మోస్తారు క్రేజ్ తెచ్చుకున్న ఆషిక రంగనాథ్ తెలుగులో తొలి సినిమా నందమూరి హీరో కళ్యాణ్ రామ్ తో చేసింది. అమిగోస్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన అమ్మడు ఆ సినిమాతో ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. అయితే నాగార్జున తో కలిసి నా సామిరంగ అంటూ సంక్రాంతికి వచ్చిన ఆషిక ఆ సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. ఆ సినిమా చూసిన వారంతా కూడా ఆషిక గురించి ప్రత్యేకంగా మాట్లాడుకునేలా అమ్మడి అభినయం చూపించింది. తెలుగులో ఒక్క హిట్ పడితే ఆ హీరోయిన్ రేంజ్ ఎక్కడికో వెళ్తుంది. ప్రస్తుతం నా సామిరంగ తర్వాత ఆషిక వెంట దర్శక నిర్మాతలు క్యూ పడుతున్నారని తెలుస్తుంది. తెలుగులో రాబోయే రోజుల్లో నెక్స్ట్ బిగ్ స్టార్ గా అవతరించే క్వాలిటీస్ అన్నీ ఆషికాలో ఉన్నాయని తెలుస్తుంది. అయితే ఆఫర్లు వస్తున్నాయి కదా అని కథను పట్టించుకోకుండా సినిమాలు చేసే ఆలోచనలో లేదు ఆషిక. ప్రేక్షకులు తన మీద చూపిస్తున్న ఈ అభిమానం కాపాడుకునే క్రమంలో అమ్మడు స్టోరీస్ సెలక్షన్స్ లో క్లవర్ నెస్ చూపిస్తుందట. ఈమధ్య ఒకటి రెండు కథలు తన దగ్గరకు వచ్చినా సున్నితంగా తిరస్కరించిందట అమ్మడు. సో వాళ్లేమనుకుంటారు వీళ్లేమనుకుంటారు అనుకుని వచ్చిన ప్రతి ఆఫర్ ఓకే చేస్తే నీ గురించి అనుకునే వారు ఎవరు ఉండరనే విషయాన్ని ముందే కనిపెట్టింది ఆషిక. అందుకే అమ్మడి గురించి తెలిసిన ఎవరైనా అందంతో పాటు తెలివి కూడా ఎక్కువే అని అంటుంటారు. నా సామిరంగ తర్వాత ఆషిక నెక్స్ట్ సినిమా ఏదన్నది ప్రస్తుతానికి సస్పెన్సే. మరి ఈ అందాల భామని లక్కీ హీరోయిన్ ని ఏ హీరో.. ఏ డైరెక్టర్ ఎంపిక చేస్తారన్నది చూడాలి. ఆఫర్లు వరుసగా వస్తున్నా కథల విషయంలో ఆచి తూచి అడుగులేస్తున్న ఆషిక మరో హిట్ పడింది అంటే మాత్రం కచ్చితంగా తెలుగులో ఆమెకు ఒక టాప్ చెయిర్ స్పేర్ చేయాల్సిందే అని చెప్పొచ్చు.





## "ప్లీజ్ గివ్ డేట్స్ అమ్మ" కీర్తి కి ట్వీట్ చేసిన హీరో

కీర్తి సురేష్ తమిళ్ తో పాటు బాలీవుడ్ లో కూడా సినిమాలు కమిట్ అవుతూ బిజీగా ఉన్న విషయం తెల్సిందే. ఈ మధ్య కాలంలో ఎక్కువగా తమిళ సినిమాలతో బిజీగా ఉంటున్న ఈ అమ్మడు వరుణ్ దావన్ సినిమా షూటింగ్ లో పాల్గొనేందుకు రెడీ అవుతోంది. తాజాగా కీర్తి సురేష్ చీర కట్టు లో ఫోటోలను షేర్ చేసింది. న్యూ బిగినింగ్ అంటూ వరుణ్ దావన్ కొత్త సినిమా హ్యాష్ ట్యాగ్ ను షేర్ చేసింది. దాంతో కీర్తి సురేష్ కు వరుణ్ దావన్ రిక్వెస్ట్ గా ప్లీజ్ గివ్ డేట్స్ అమ్మ (దయచేసి డేట్స్ ఇవ్వు అమ్మ) అంటూ కామెంట్ పెట్టాడు. కీర్తి సురేష్ పెట్టిన పోస్ట్ కు వరుణ్ దావన్ కామెంట్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. కొద్ది నిమిషాల్లోనే ఆ కామెంట్ వైరల్ అయ్యింది. కీర్తి సురేష్ పాపం బాలీవుడ్ సినిమాలకు డేట్లు ఇవ్వడం లేదా.. వరుణ్ దావన్ చాలా రోజులుగా కీర్తి సురేష్ డేట్ల కోసం వెయిట్ చేస్తున్నాడా అంటూ పలువురు పలు రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. అట్లీ నిర్మాణంలో కలీస్ దర్శకత్వంలో వరుణ్ దావన్ హీరోగా కీర్తి సురేష్ మరియు వామికా గబ్బి హీరోయిన్స్ గా సినిమా రూపొందుతోంది. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసి కొంత మేరకు షూటింగ్ కూడా జరిగిందనే వార్తలు వస్తున్నాయి. కానీ కీర్తి సురేష్ బిజీగా ఉండటం వల్ల డేట్లు ఇవ్వలేక పోతుందేమో అని వరుణ్ దావన్ కామెంట్ ని చూస్తే అనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తెలుగులో ఈ మధ్య కాలంలో కీర్తి సురేష్ పెద్దగా ఆఫర్లు దక్కించుకోలేక పోతుంది. కానీ తమిళంలో మాత్రం రెగ్యులర్ గా సినిమాలు చేస్తూనే ఉంది. చేతిలో పెద్దగా సినిమాలు లేకున్నా కూడా ఎందుకు కీర్తి సురేష్ డేట్లు ఇవ్వడంలో విఫలం అవుతుంది అంటూ కొందరు వరుణ్ దావన్ కి మద్దతుగా కీర్తి సురేష్ పై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వరుణ్ దావన్ కామెంట్ కి కీర్తి సురేష్ ఎలా రియాక్ట్ అవుతుందా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సోషల్ మీడియాలో మొత్తానికి వరుణ్ దావన్ మరియు కీర్తి సురేష్ సినిమాకు సంబంధించిన పోస్ట్, కామెంట్ వైరల్ అవుతోంది.

## ఎఫ్ ఐఆర్ కొట్టేయాలని జాకీ...సంబంధాలున్నాయని ఈడీ!

200 కోట్ల మనీలాండరింగ్ కేసులో బాలీవుడ్ నటి జాక్వెలిన్ పెర్నాండేజ్ ఆరోపణలు ఎదుర్కుంటోన్న సంగతి తెలిసిందే. తొలుత కేసులో కీలక పాత్ర ధారి అయిన కాన్ మాన్ సుకేష్ చంద్రతో సన్నిహితంగా మెలిగిన వ్యవహారం..అటుపై ఈడీ విచారణ తర్వాత అదే కేసుకు సంబంధించి సుకేష్ పై ఎటాకింగ్ దిగడంతో సన్నివేశం ఎంత రసవత్తరమైందో తెలిసిందే.ఇద్దరు ఒకరిపై ఒకరు అదనపు కేసులు బనాయించుకోవడంతో కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయి. తనకేం తెలియదని. తనపై నమోదైన ఎఫ్ ఐఆర్ కొట్టేయాలని కోర్టులో జాక్వెలిన్ కేసు వేయడం తెలిసిందే. అయితే ఈ కేసుతో జాక్వెలిన్ కి సంబంధాలున్నాయని ఈడీ కోర్టు లో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రీ ముందుకు వెళ్లింది. దీనిపై కొంత విచారణ అనంతరం తదుపరి విచారణ ఏప్రిల్ 15కి వాయిదా వేసింది హైకోర్టు. అలాగే సుకేష్ చంద్రశేఖర్ నుంచి రక్షణ కోరుతూ జాక్వెలీన్ ఫెర్నాండెజ్ ఢిల్లీ కోర్టును ఆశ్రయించింది. ఇటీవల జాక్వెలీన్ ఫెర్నాండెజ్ ఢిల్లీలోని కోర్టులో తాను కోర్టు విచారణలో పాల్గొంటున్నప్పుడు తనకు సందేశాలు – వాయిస్ నోట్ పంపిన సుకేష్ చంద్రశేఖర్ నుండి రక్షణ కోరుతూ మరో పిటిషన్ దాఖలు చేసింది. అవన్నీ తప్పు అని చెబుతూ.. అతని లేఖలు తన భద్రతకు ముప్పు కలిగిస్తున్నాయని పిటీషన్ లో పేర్కొంది. తనపై కావాలనే ఉద్దేశపూర్వకంగానే మీడియాకి చెడుగా ఫోకస్ చేస్తున్నాడని..అతడిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్థిక నేరాల విభాగం కు కూడా ఫిర్యాదు చేసింది. అయితే వీటిపై ఆర్థిక నేరాల విభాగం స్పందించినట్లు తెలుస్తోంది. సుకేష్ నిత్యం లేఖలు పంపుతున్నాడని హైలైట్ చేసింది. మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా జాక్వెలీన్‌కు సంబంధించిన లేఖలను పంపడం అలవాటు చేసుకు న్నాడని.. ఇది ఆమెను నేరుగా బెదిరించడం మాత్రమే కాదు. ఆమె సామాజిక వృత్తిపరమైన పనులను కూడా ప్రభావితం చేస్తుంది' అని వెల్లిండిం చింది. అయితే ఈ కేసులో జాక్వెలిన్ ఈడీకి సహకరించలేదని ఈడీ చెబుతుంది. డేటాను తన ఫోన్ నుంచి డిలీట్ చేసిందని..అలాగే తన సన్నిహితుల వద్ద కూడా ఎలాంటి డేటా లేకుండా తొలగించిందని..ఈ కేసుతో జాక్వెలిన్ కి దగ్గర సంబంధాలున్నాయని ఈడీ ఆరోపిస్తుంది.





## సమంతకు కొత్తగా ఆ సమస్య కూడా?

సమంత కెరీర్ జెట్ స్పీడ్ తో సాగిపోతున్న సంగతి తెలిసిందే. ఎక్కడ కాలు పెట్టినా అక్కడ సక్సెస్ అన్నట్లే సాగిపోతుంది. ప్రస్తుతం అమ్మడు విశ్రాంతిలో ఉంది. తిరిగొచ్చిన తర్వాత బాలీవుడ్ ని ఏలే దిశగా అడుగులు వేయబోతుంది. ఇప్పటికే ఓ ప్రణాళిక వేసుకుని ముందకెళుంది. బాలీవుడ్ లో తన పరిచయాలన్నింటిని సద్వినియోగం చేసుకుంటుంది. ఇలా కెరీర్ పరంగా సమంతకి ఎలాంటి ఇబ్బంది లేదు. ఆలస్యమైనా సక్సెస్ దిశగానే అడుగులు పడతాయని ధీమా ఉంది. కానీ వ్యక్తిగత జీవితంలో అనారోగ్య సమస్యలు మాత్రం అంతే వెంటాడుతున్నాయి. మయోసైటిస్ కారణంగా ఎంతంగా ఇబ్బంది పడిందో తెలిసిందే. ఇప్పుడు విరామం తీసుకోవడానికి కారణం కూడా ఆ వ్యాధి కారణం. చికిత్స లో భాగంగా విరామం అవసరమ్వడంతో రెస్ట్ ఇచ్చింది. లేకపోతే ఈ గ్యాప్ లో మరికొన్నిసినిమాలు పూర్తిచేసేది. ఈ నేపథ్యంలో తాజాగా సమంతకు మరో అరుదైన సమస్య ఉందన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సమంతకి పూలు అంటే ఎలర్జీ అట. ఆ వాసన అస్సలు పడదంట. పూలతో ఎక్కువ సమయం గడపలేను అంటోంది. ఇదేమి పెద్ద సమస్య కాదు. చాలా మందికి పూల స్మెల్ పడదు. వాటికి దూరంగా ఉంటే సరిపోతుంది. అందుకేనేమో సమంత ఇంతవరకూ ఏ సినిమాలోనూ నేచురల్ పువ్వులు పెట్టుకుని నటించలేదేమో. షూట్ లో అవసరం అనుకుంటే ప్లాస్టిక్ పువ్వులు వినియోగించి ఉంటారు. ఈ విషయం తెలియక ఇంత కాలం సమంత ఒరిజినల్ పువ్వులతో అమ్మడు అలంకరించుకు ని నటిందనుకున్నారే.

# వారసుల కోసం నేతల టెన్షన్

## బొత్స నుంచి అయ్యన్న కుమారుడి వరకు

విశాఖపట్టణం : ఉత్తరాంధ్రలోని పలు పార్టీల్లో కీలక నేతలుగా ఎదిగిన నాయకులు తమ వారసుల రాజకీయ భవితవ్యంపై మథనపడుతున్నారు. గడిచిన 20, 30 ఏళ్ల నుంచి రాజకీయాలు చేస్తూ.. అనేకసార్లు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పని చేసని ముఖ్యమైన నేతలు వచ్చే ఎన్నికల్లో తమ వారసులను రాజకీయ రంగప్రవేశం చేయించి.. శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని భావించారు. అందుకు అనుగుణంగా గ్రౌండ్‌ను చాలా మంది నాయకులు ప్రిపేర్ చేశారు. కానీ, ఆయా నేతలకు పార్టీ అధిష్టానం నుంచి వారసుల రాజకీయ రంగ ప్రవేశానికి గ్రీన్ సిగ్నల్ లభించకపోవడంతో మరోసారి పోటీ చేయాల్సిన పరిస్థితి వారికి ఏర్పడింది. వారసులను రంగ ప్రవేశం చేయించాలనుకునే వారి జాబితాలో వైసీపీతోపాటు టీడీపీలోనూ ఎక్కువగానే ఉంది. పార్టీ అధినాయకత్వ సూచనలతో సీనియర్ నేతలే మరోసారి బరిలోకి దిగాల్సి వస్తుండడంతో వారుసలకు మరికొంత కాలం నిరీక్షణ తప్పని పరిస్థితి ఏర్పడింది. వారుసుల రాజకీయ రంగప్రవేశం చేయించాలని భావించిన నాయకులు జాబితాలో సీనియర్ మంత్రి, ఉత్తరాంధ్రలో వైసీపీ కీలక నేతగా ఉన్న బొత్స సత్యనారాయణ ముందు వరుసలో ఉన్నారు. 2024 ఎన్నికల్లో రాజకీయ వారుసుడిని బరిలోకి దించాలని ఆయన ముందు నుంచీ భావిస్తూ వచ్చారు. ఇందుకోసం చాలా కాలం కిందటి నుంచే ఆయన గ్రౌండ్ ప్రిపేర్ చేశారు. మాజీ ఎంపీ, తాజా విశాఖ వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి, మంత్సి బొత్స సత్యనారాయణ కుమారుడు డాక్టర్ బొత్స సందీప్‌ను వచ్చే ఎన్నికల్లో బరిలోకి దించేందుకు సిద్ధమయ్యారు. డాక్టర్ బొత్స సందీప్ కూడా గత కొన్నాళు నుంచి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. మెడికల్ క్యాంపులు, సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతున్నారు. కానీ, అనూహ్యంగా వైసీపీ అధిష్టానం బొత్స సందీప్ పోటీకి క్లియరెన్స్ ఇవ్వలేదు. ఈసారి కూడా బొత్స సత్యనారాయణ దంపతులు బరిలో ఉండాలని సీఎం జగన్ బలంగా ఆకాంక్షించారు. అందుకు అనుగుణంగానే వారి అభ్యర్థిత్వాలను ఖరారు చేయడంతో సందీప్ మరికొంత కాలం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్రీకాకుళంజిల్లాలో వారుసులను బరిలో దించాలని భావిస్తున్న నాయకుల సంఖ్య అధికంగానే ఉంది. స్పీకర్ తమ్మినేని సీతారాం తన కుమారుడు చిరంజీవి నాగ్ ను పోటీ చేయించాలని భావించారు. అధిష్టానం నుంచి సానుకూలత రాకపోవడంతో ఆయనే పోటీకి సిద్ధపడుతున్నారు. ఇక్కడ ఆయనకు పోటీగా మరో వ్యక్తి బలంగా పని చేస్తుండడంతో ఇక్కడ పోటీ వాతావరణం నెలకొంది. ఇదే జిల్లాలో సీనియర్ మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు కుమారుడిని బరిలోకి దించాలని భావించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి నియోజకవర్గం అంతటా ఆయన కుమారుడు రామ్ మనోహర్ నాయుడు విస్తృతంగా పర్యటిస్తున్నారు. పల్లె నిద్ర వంటి కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో ఉంటున్నారు. ధర్మాన ప్రసాదరావు కూడా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని, పార్టీకి పని చేస్తానన స్పష్టం చేశారు. కానీ, సీఎం జగన్ ఇందుకు అంగీకరించలేదని, మళ్లీ ఆయన్నే బరిలో దిగాలని కోరుతున్నట్టు చెబుతున్నారు. దీంతో తప్పని సరి పరిస్థితుల్లో మరోసారి బరిలో నిలిచేందుకు ధర్మాన సిద్ధమవుతున్నారు. మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్‌కూడా వారసుడిని అసెంబ్లీకి పంపించాలని ఉవ్విళ్లూరుతున్నారు. గత ఎన్నికల్లో జెడ్పీటీసీగా బరిలోకి దిగిన ఆయన కుమారుడు ధర్మాన కృష్ణ చైతన్య వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి వెళ్లేందుకు అనుగుణంగా పని చేసుకుంటూ వచ్చారు. కానీ, అధిష్టానం నుంచి అనుమతి రాకపోవడంతో మళ్లీ కృష్ణదాస్ పోటీకి సిద్ధపడుతున్నారు. తెలుగుదేశం పార్టీలోనూ వారసుల పోటీ ఎక్కువగానే ఉంది. మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు కుమారుడిని ఈ ఎన్నికల్లో బరిలోకి దించేందుకు సిద్ధమయ్యారు. ఎచ్చెర్ల నుంచి రామ్ మల్లిక్ నాయుడిని బరిలోకి దించాలని భావించి కళా.. పార్టీ నుంచి సానుకూలత రాకపోవడంతో మళ్లీ ఆయనే పోటీకి సిద్ధపడుతున్నారు. మాజీ మంత్రి ప్రతిభా భారతికూడా తన వారసురాలు కావలి గ్రీష్మను పోటీ చేయించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రాజాం అసెంబ్లీ నియోజకవర్గం సీటు కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. కానీ, పార్టీ నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఎదురు చూస్తున్నారు. విశాఖ జిల్లాలోనూ పలువురు సీనియర్ నేతల వారసులు సిద్ధంగా ఉన్నారు. ఇక్కడ తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు వారసులు రెడీగా ఉన్నారు. ఈ జాబితాలో మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడుకుమారుడు విజయ్, బండారు సత్యనారాయణమూర్తి కుమారుడు అప్పలనాయుడు ఉన్నారు. అయ్యన్నపాత్రుడు తనకు నర్సీపట్నం ఎమ్మెల్యే స్థానంతోపాటు కుమారుడికి అనకాపల్లి ఎంపీ స్థానాన్ని కేటాయించాల్సిందిగా అధిష్టానాన్ని కోరుతున్నారు. పార్టీ నుంచి ఇంకా సానుకూల స్పందన రాకపోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు. మాజీ మంత్రి బండారు కుమారుడు గడిచిన ఐదేళ్ల నుంచి పార్టీ వ్యవహారాలను పెందుర్తి నియోజకవర్గంలో చక్కబెడుతున్నారు. కానీ, పార్టీ ఇప్పట్లో అప్పలనాయుడుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం కనిపించడం లేదు.

ఈ నియోజకవర్గంలో సీటును జనసేనకు ఇచ్చే అవకాశముందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వారసుడి పేరు ప్రతిపాదించడం కంటే.. తన పేరుతోనే ముందుకు వెళ్లడం వల్ల ఫలితం ఉంటుందని సత్యనారాయణమూర్తి భావిస్తున్నట్టు చెబుతున్నారు. ఇక్కడి లెక్కలు ఆధారంగా అప్పలనాయుడు మరికొంత కాలం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రానున్న ఎన్నికలను అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. విజయమే లక్ష్యంగా పోటీకి సిద్ధమవుతున్నాయి. ఈ తరుణంలో రాజకీయ అనుభవం లేని వారసులను పోటీలోకి దింపడం వల్ల కొంత ఇబ్బంది ఎదురవుతుందని పార్టీ అధిష్టానాలు భావిస్తున్నాయి. సీనియర్ నాయకులు బరిలో దిగితే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని పార్టీ నాయకత్వాలు భావిస్తుండడం వల్లే.. వారసులకు క్లియరెన్స్ ఇవ్వడం లేదు. వారసులకు టికెట్లు ఇవ్వడం ద్వారా ప్రత్యర్థి పార్టీలకు విజయావకాశాలను పెంచే అవకాశముంటుందని సర్వేలు ద్వారా పార్టీలు గుర్తించాయి. అందుకే వారసులను ఈసారికి పోటీకి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

# నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు

నెల్లూరు : ఏపీలో గత రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. రిజిస్ట్రార్ ఆఫీసుల్లో సర్వర్లు మొరాయిస్తుండడంతో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో పనులు ఆగిపోయాయంటూ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సాంకేతిక సమస్యలతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. కాసేపు రిజిస్ట్రేషన్లు జరుగుతూ, మరి కాసేపు నిలుస్తూ మందకొడిగా సాగుతున్నాయి. రిజిస్ట్రేషన్ వెబ్ సైట్ లో అప్లికేషన్ ఓపెన్ కాకపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు కదలడంలేదని ఉద్యోగులు అంటున్నారు. అయితే గత రెండు కాస్త పనిచేసిన సర్వర్లు ఇవాళ పూర్తిగా షట్‌డౌన్ అయ్యాయి. సర్వర్లు షట్‌డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్ సేవలకు నిలిచిపోయాయి. సాంకేతక సమస్యలపై పై అధికారులకు మెయిల్స్ పంపుతున్నామని ఉద్యోగులు అంటున్నారు. వారం నుంచి ఇలాంటి సమస్యలే వస్తున్నాయని, రిజిస్ట్రేషన్లు జరగడంలేదని ప్రజలు అంటున్నారు. 100 రిజిస్ట్రేషన్లు జరిగే ఆఫీసుల్లో కేవలం 30 వరకే జరిగే పరిస్థితి నెలకొందన్నారు. సర్వర్ల సాంకేతి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఏపీ సర్కార్ ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 27 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు 31 లక్షల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు, వార్డు అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల్లో 10 రకాల సేవలను అందిస్తున్నారు. ఇకపై గ్రామ, వార్డు సచివాలయాలు జాయింట్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలుగా సేవలందిస్తున్నాయి. ఈ నెల 27 నుంచి నవరత్నాల్లో భాగంగా జగనన్న శాశ్వత స్థల హక్కు పథకం ద్వారా పేదలకు ఇంటి పట్టాలకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తించి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలు చేస్తున్నట్లు సీఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. మరో నెల రోజుల్లో వివాహ ముహూర్తాలు మొదలవుతాయి. వరుసగా పెళ్లిళ్లు జరుగుతుంటాయి. పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ల ఫీజులను ఏపీ ప్రభుత్వం సవరించింది. వివాహాల నమోదుకు సంబంధించి ఫీజులను పెంచుతూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం వివాహ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 ఉండగా, దానిని రూ.500కు పెంచింది. వివాహ వేదిక వద్దకు సబ్ రిజిస్ట్రార్ వస్తే ఇప్పటివరకు ఉన్న రూ.210 ఫీజును అమాంతం రూ.5 వేలకు పెంచింది. ప్రస్తుత ఏడాదిలో వివాహాల రికార్డుల పరిశీలనకు రూపాయిగా ఉన్న ఫీజును రూ.100లకు పెంచింది. సెలవు రోజుల్లో వివాహాల నమోదుకు ఫీజును రూ.5 వేలు చేసింది. ఇందుకు గానూ 1955 హిందూ వివాహ రిజిస్ట్రేషన్ చట్టానికి సంబంధించి 1965లో జారీచేసిన ఫీజులను సవరిస్తూ ఏపీ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ఫీజులు పెంచినప్పటికీ పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వివాహ రిజిస్ట్రేషన్లను మరింత సులభం చేస్తున్నట్లు పేర్కొంది. రిజిస్ట్రేషన్ మ్యారేజ్ కోసం ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించింది.

# ఒకే రోజు బ్రహ్మోత్సవం

తిరుమల : సూర్య జయంతి సందర్భంగా ఫిబ్రవరి 16వ తేదీన తిరుమలలో రథసప్తమి పర్వదినం జరుగనుంది. ఈ సందర్భంగా ఏడు వాహనాలపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం వివరాలను వెల్లడించింది. పవిత్రమైన మాఘ మాసంలో శుక్ల పక్ష సప్తమి తిథిని రథ సప్తమి లేదా మాఘ సప్తమి అని పిలుస్తారు. ఈ పరమ పవిత్రమైన రోజున శ్రీ సూర్యదేవుడు జన్మించాడని, ప్రపంచం మొత్తానికి జ్ఞానం ప్రసాదించాడని వేదాల ద్వారా తెలుస్తోంది. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని భారీ సంఖ్యలో తిరుమలకు విచ్చేసే భక్తుల కోసం టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేస్తోంది. రథసప్తమిని మినీ బ్రహ్మోత్సవాలు అని కూడా అంటారు.

వాహనసేవల వివరాలు :

తెల్లవారుజామున 5.30 నుంచి 8 గంటల వరకు (సూర్యోదయం ఉదయం 6.40 గంటలకు) – సూర్యప్రభ వాహనం

ఉదయం 9 నుంచి 10 గంటల వరకు – చిన్నశేష వాహనం

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు – గరుడ వాహనం

మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు – హనుమంత వాహనం

మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు – చక్రస్నానం

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు – కల్పవృక్ష వాహనం

సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు – సర్వభూపాల వాహనం

రాత్రి 8 నుంచి 9 గంటల వరకు – చంద్రప్రభ వాహనం

రథసప్తమని పర్వదినం కారణంగా ఫిబ్రవరి 16వ తేదీన ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది. కాగా, సుప్రబాతం, తోమాల, అర్చన ఏకాంతంలో నిర్వహిస్తారు.

విశేష పర్వదినాలు

తిరుమల శ్రీవారి ఆలయంలో ఫిబ్రవరి నెలలో జరుగనున్న విశేష పర్వదినాలను వెల్లడించింది టీటీడీ. ఆ వివరాలు ఇలా ఉన్నాయి?

ఫిబ్రవరి 9న శ్రీ పురందరదాసుల ఆరాధనోత్సవం.

ఫిబ్రవరి 10న తిరుకచ్చినంబి ఉత్సవారంభం.

ఫిబ్రవరి 14న వసంతపంచమి.

ఫిబ్రవరి 16న రథసప్తమి.

ఫిబ్రవరి 19న తిరుకచ్చినంబి శాత్తుమొర.

ఫిబ్రవరి 20న భీష్మ ఏకాదశి.

ఫిబ్రవరి 21న శ్రీ కులశేఖరాళ్వార్ వర్ష తిరునక్షత్రం.

ఫిబ్రవరి 24న కుమారధార తీర్థముక్కోటి, మాఘ పౌర్ణమి గరుడసేవ.

తిరుపతి శ్రీ కోదండ రామాలయంలో ఫిబ్రవరి నెలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఫిబ్రవరిలో 3, 10, 17, 24వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ సీతారామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్‌సేవ, తిరువీధి ఉత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు. ఫిబ్రవరి 9న అమావాస్య సందర్భంగా ఉదయం 8 గంటలకు సహస్ర కలశాభిషేకం చేపడతారు. రాత్రి 7 గంటలకు హనుమంత వాహనసేవ జరుగనుంది. ఫిబ్రవరి 21వ తేదీ పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం జరుగనుంది. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల గుండా శ్రీరామచంద్ర పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళతారు. సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్‌సేవ, ఆస్థానం నిర్వహిస్తారు. ఫిబ్రవరి 25న పౌర్ణమి సందర్భంగా కూపుచంద్ర పేట ఉత్సవం నిర్వహించనున్నారు




## అపోలోలో 'అన్ మాస్క్ క్యాన్సర్' పై అవగాహన

విశాఖ ఆరిలోవ, ఫిబ్రవరి 2, (ప్రజా కలం).... సమాజంలో విమర్శకు, వివక్షతకు భయపడి ఈ వ్యాధిని పడినవారు కృంగిపోవడంతో పాటు, మానసిక స్థైర్యాన్ని కోల్పోతున్నారని అపోలో క్యాన్సర్ సెంటర్, మెడికల్ అండ్ హేమాటో అంకాలజీ సీనియర్ డాక్టర్ రాకేష్ రెడ్డి బొయా అన్నారు. ఆరిలోవ అపోలో హాస్పిటల్లో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా 'అన్ మాస్క్ క్యాన్సర్' పేరుతో ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా డా రాకేష్ రెడ్డి బోయ మట్లాడుతూ, నేటి ఆధునిక వైద్య సాంకేతిక పరిజ్ఞానంతో క్యాన్సర్ వ్యాధిని నిర్మూలించడం సులభతరమయ్యిందని, సమాజంలో ఈ వ్యాధి ఎదుర్కొంటున్న వారిని అంటరాని వాళ్ళగా చూడరాదన్నారు. అందుకే క్యాన్సర్ దినోత్సవం రోజు 'అన్ మాస్క్ క్యాన్సర్, పేరుతో కార్యక్రమం చేపట్టామని, క్యాన్సర్ బారిన పడినవారు వ్యాధిని బయట పెట్టకుండా రహస్యంగా ఉంచవలసిన అవసరం లేదన్నారు. క్యాన్సర్కు చాలా మంది అయపడుతున్నారని ఇప్పుడు ఆ పరిస్థిది లేదని ధైర్యంగా ఉంటే తొందరగా నయమవుతుంది అన్నారు. క్యాన్సర్ బారినుండి బయటపడ్డ వారిని అంటరానివారిగా చూస్తున్నారని ఈ వివక్ష ప్రజల్లో ప్రజల్లో తొలగి పోవాలని అందుకే దీనిపై అవగాహన చయవలసిన అవసరం ఎంతైనా ఉందని క్యాన్సర్ విజేతలు శ్రీమతి జయశ్రీ, కుమారి గాయత్రి లు అన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సుమన్ దాస్, డాక్టర్ రమేష్ అలుమూరి, డాక్టర్ ఆదిత్య నారాయణ, డాక్టర్ జయశ్రీ కూన, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వెంట్రపాటి, డాక్టర్ చంద్ర కళ్యాణ్, డాక్టర్ బాలకృష్ణ, సీవోవో రామచంద్ర పాల్గొని క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు.

# జగన్ ఢిల్లీ టూరు లెక్కేంటీ...

విజయవాడ : గత ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇదే మాదిరిగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2019 ఎన్నికల ముందు నాటికి చాలామంది టిడిపి నాయకులు వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. నీరు చెట్టు వంటి పథకం ద్వారా చేపట్టిన పనులకు చంద్రబాబు బిల్లులు చెల్లించలేదు. ఏపీ సీఎం జగన్ ఢిల్లీ ఎందుకు వెళ్తున్నారు? హోం మంత్రి అమిత్ షా అపాయింట్మెంట్ ఎందుకు కోరారు? రాజకీయ ప్రయోజనాల కోసం? లేకుంటే కేసుల విషయంలో మాట్లాడేందుకా? ఇది కాకుండా ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయా? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఎన్నికలకు పట్టుమని రెండు నెలల వ్యవధి కూడా లేదు. ఏ క్షణం అయినా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే జగన్ అమిత్ షాను కలిసేందుకు ప్రయత్నించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ రెండు నెలల్లో కీలకమైన సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొనాలని జగన్ భావిస్తున్నారు. వాటితో పాటు ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు, వైసిపి కిందిస్థాయి నేతలకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు.. ఇలా అన్నింటికీ భారీ మొత్తంలో నిధులు అవసరం. వైసీపీలో కిందిస్థాయి నేతలు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలువంటి వాటిని నిర్మించారు. వీటితో పాటు రహదారులు, కాలువల నిర్మాణం చేపట్టారు. వీటన్నింటికీ వేల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. వీటిని చెల్లించకుండా ఎన్నికలకు వెళ్తే ప్రతికూల ఫలితాలు వస్తాయని జగన్ భయపడుతున్నారు. అటు వైసీపీ ఎమ్మెల్యేలు సైతం పదేపదే బిల్లుల విషయమై జగన్ కు ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రుణ పరిమితి పెంచుకొని.. వివిధ పద్ధతుల ద్వారా నిధుల సేకరణకు జగన్ ఢిల్లీ బాట పడుతున్నట్లు తెలిసింది. గత ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇదే మాదిరిగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2019 ఎన్నికల ముందు నాటికి చాలామంది టిడిపి నాయకులు వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. నీరు చెట్టు వంటి పథకం ద్వారా చేపట్టిన పనులకు చంద్రబాబు బిల్లులు చెల్లించలేదు. మరోసారి తామే అధికారంలోకి వస్తాం అన్న ధీమాతో చెల్లింపుల విషయంలో జాప్యం చేశారు. కొంత చెల్లింపులు చేస్తామనగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. దీంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల్లో టిడిపికి ఓటమి ఎదురైంది. దీంతో బిల్లుల చెల్లింపు లేకుండా పోయింది. కోర్టులకు వెళ్ళినా.. రకరకాల కారణాలు చూపుతూ జగన్ సర్కార్ బిల్లులు చెల్లించలేదు. ఇప్పుడు అదే పరిస్థితి వైసీపీ నేతలకు రాకుండా చూసేందుకే జగన్ ఢిల్లీ వెళుతున్నట్లు సమాచారం. ఏదో మూలంగా కేంద్రాన్ని ఒప్పించి నిధులు విడుదలకు జగన్ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే అమిత్ షా అపాయింట్మెంట్ ను తీసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. అయితే ఎల్లో మీడియా మాత్రం రాజ్యసభ ఎన్నికలు, షర్మిల ఎంట్రీ, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సాయాన్ని ఇచ్చిపుచ్చుకోవడం వంటి కథనాలను వండి వార్చుతోంది. కానీ అసలు విషయం నిధుల వేటకేనని తెలుస్తోంది. అయితే అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# అనూహ్యంగా కాంగ్రెస్ ఊపు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు రోజు రోజులుకు కీలక మలుపులు తిరుగుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వచ్చే సమయంలో అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ ఊపు పెంచకుంటూ పోతోంది. నిన్నా మొన్నటిదాకా అసలు కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందా లేదా అన్నది కూడా ఎవరూ పట్టించుకోలేదు. అభ్యర్థుల్ని నిలబెట్టినా నిలబెట్టకపోయినా పెద్దగా తేడా ఉండదని ఊరుకున్నారు. కానీ ఎప్పుడైతే షర్మిల ఏపీసీసీ చీఫ్ గా నియమితులయ్యారో అప్పటి నుంచి ఆ పార్టీ నేతలు చేసే ప్రతి కామెంట్ హైలెట్ అవుతోంది. ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ గా మాణిగం ఠాగూర్ వ్యవహరిస్తు న్నారు. ఇంతకు ముందు ఆయన తెలంగాణలో పని చేశారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెప్పించేందుకు ఆయ నను ఏపీకి నియమించారు. షర్మిల దూకుడుగా ప్రజల్లోకి వెళ్లేందుకు నిర్వహిస్తన్న కార్యక్రమాల్లో మాణిగం ఠాగూర్ కీలకంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. మాణిగం ఠాగూర్ తాజాగా సోషల్ మీడియాలో ఓ కీలక ప్రకటన చేశారు. జగన్ పార్టీకి కేవలం ముగ్గురంటే ముగ్గురు ఎంపీలు మాత్రమే మిగులుతారని జోస్యం చెప్పారు. మాణిగం ఠాగూర్ ప్రకటన సోషల్ మీడియాలో ఒక్క సారిగా వైరల్ అయింది. ప్రస్తుతం ఉన్న ఎంపీలందరూ పార్టీకి గుడ్ బై చెబితే.. చివరికి ముగ్గురు ఎంపీలు మిగులుతారా లేకపోతే వచ్చే ఎన్నికల్లో వైసీపీ కేవలం మూడు సీట్లు గెలుచుకుంటుందా అన్నదానిపై క్లారిటీ లేదు. ఇతర వివరాలపై ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. టిక్కెట్ల కసరత్తులో భాగంగా జగన్ మోహన్ రెడ్డి ఎంపీల విషయంలో కీలక నిర్మయాలు తీసుకుంటు న్నారు. అతి కొద్ది మంది మాత్రమే మళ్లీ టిక్కెట్ కేటాయిస్తు న్నారు. ఇప్పటికే కర్నూలు, మచిలీపట్నం, నర్సరావుపేట ఎంపీలు రాజీనామా చేశారు. విజయనగరం, అరకు, విశాఖపట్నం, తిరుపతి, చిత్తూరు ఇలా అనేక నియోజక వర్గాల ఎంపీ టిక్కెట్లను మార్చేశారు ఇప్పటి వరకూ ఎంపీ టిక్కెట్లు ఫలానా వారికి ఖాయం అని వైసీపీ నుంచి ప్రకటన రాలేదు. కడప నుంచి అవినాష్ రెడ్డి, రాజంపేట నుంచి మిథున్ రెడ్డిలకు మాత్రమే ఖాయమని ఇంకెవరికీ ఎన్నికల వరకూ గ్యారంటీ ఉండదని చెబుతున్నారు. ఈ లెక్కలేసుకుని మాణిగం ఠాగూర్ కామెంట్లు చేశారా లేకపోతే.. ఇప్పుడు ఉన్న 22 మంది ఎంపీల్లో 19 మంది పార్ట ఫిరాయిస్తున్నారని చెబుతున్నారా అన్నదానిపై స్పష్టత లేదు. ఎప్పుడో ఓ ఎంపీ దూరమయ్యారు. అయితే మాణిగం ఠాగూర్ వచ్చే ఎన్నికల్లో వచ్చే సీట్ల గురించి పెట్టారని కొంత మంది విశ్లేషిస్తున్నారు. లేటెస్ట్ సర్వే రిపోర్టు ప్రకారం అందుకే ఆయన ఆ వ్యాఖ్యలు చేశారని.. కుప్పకూలిపోతున్న వైసీపీ కోట చెప్పారని అంటున్నారు. మాణిగం ఠాగూర్ మాత్రం ఈ ఊహాగానాలను అలా వదిలేశా రు. ఆయన ఏ సోర్స్ తో ఈ ప్రకటన చేశారన్నది మాత్రం చెప్పడం లేదు.

# మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే

తిరుపతి : ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసీపీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఓ వైపు సిట్టింగ్ ఎమ్మెల్యేల అసంతృప్తి సెగలు రాజుకుంటూ ఉండగా పార్టీలో అంతర్గత విబేధాలు ఇప్పుడు హీట్ పుట్టిస్తున్నాయి. ఈ క్రమంలో తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మధ్య మాటల యుద్ధం జోరుగా సాగుతోంది. కోనేటి ఆదిమూలం ఉద్దేశ్యపూర్వకంగానే మంత్రి పెద్దిరెడ్డి పై ఆరోపణలు చేశారని, ఆదిమూలం మాటలను వైసిపి శ్రేణులు ఖండిస్తోందని సత్యవేడు సింగిల్ విండో ఛైర్మన్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. సత్యవేడు లో మట్టిమాఫియా కి అనుమతులు ఆదిమూలంకు తెలియకుండానే , ఆయన భాగస్వామ్యం లేకుండా జరుగుతోందా అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. కోనేటి ఆదిమూలంకు వైసిపి సముచిత స్థానం కల్పించినా కూడా పెద్దిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. తిరుపతి లో జరిగిన సమన్వయ సమావేశానికి ఆరోగ్యం భాగాలేదని రాలేకపోతున్నా అని చెప్పి తనయుడు సుమన్ ను పంపడం నిజం కాదా..? 70 వేల మెజార్టీతో తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తిని గెలిపిస్తామంటూఅక్కడ సుమన్ మాట్లాడటం నిజం కాదా..?అంటూ ప్రశ్నించారు. తెదేపా నుంచి రాబిన్ శర్మ టీమ్ ఆదిమూలం ను కలిసిన తర్వాత వారితో ఆదిమూలం కుమ్మక్కైనట్లు తెలుస్తోందన్నారు. ఆదిమూలం ఏపార్టీలో చేరినా రాబిన్ శర్మ టీమ్ కలిసిన తర్వాత ఎందుకు వారితో కుమ్మక్కై నిరాధార ఆరోపణలు చేశారో సత్యవేడు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇక.. ఎమ్మెల్యే తనయుడు సుమన్ తనను ఇంటికి పిలిపించి భౌతికదాడులు చేయించారని సత్యవేడు ఉపసర్పంచ్ సెంథిల్ వాపోయారు. గత ఎన్నికల్లో ఎంతగానో సహాయసహకారాలు అందించినప్పటికి , డబ్బుడబ్బు అంటూ వేధించేవారని ఉప సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను బలహీన సామాజిక వర్గానికి చెందిన వాడిననే దుర్భాషలాడే వారని ,అలాంటి వారు పార్టీ పెద్దలపై ఆరోపణలు చేయడం కరెక్ట్ కాదన్నారు. టికెట్ల కేటాయింపులో పెరుగుతున్న అసంతృప్తివల్లే కోనేటి ఆదిమూలం, పెద్దిరెడ్డిల మధ్య ఈ వార్ జరుగుతోంది. కోనేటి ఆదిమూలం.. బాహాటంగానే తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంతవరకు సత్యవేడుకు ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్న ఆదిమూలంను వైఎస్ జగన్ తిరుపతి లోక్‌సభ ఇన్‌ఛార్జిగా అపాయింట్ చేసి, తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తిని సత్యవేడు అభ్యర్థిగా ఖరారు చేయడంతో కోనేటి ఆదిమూలం అసంతృప్తికి గురయ్యారు.